ఆధ్యాత్మిక ఉత్సవం

- ఘనంగా శ్రీ జగన్నాథస్వామి రథోత్సవం
- మేళాలు, తాళాలు, నృత్యాలతో పరవశించిన భక్తులు



జగన్నాథస్వామి రథం లాగుతున్న భక్తులు



ఊరేగింపులో మహిళా భక్తులు



జగన్నాథస్వామి రథయాత్ర, తరలివచ్చిన భక్తులు

బంజారాహిల్స్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12లోని శ్రీ జగన్నాథస్వామి ఆలయంలో జగన్నాథస్వామి రథోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం నుంచే దేవతా మూర్తులను దర్శించుకునేందుకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. ప్రధాన రహదారిపై దాదాపు మూడు గంటలపాటు ఊరేగింపు సాగింది. స్థానిక కనకదుర్గ ఆలయం వరకు ఊరేగింపు జరిగింది. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భక్తులకు ఉచితంగా ప్రసాదం, తాగునీరు సరఫరా చేశారు.

స్వామి వారి వనవాసం

యేడాది పాటు పూజలందుకునే శ్రీ జగన్నాథస్వామి సతీసమేతంగా పది రోజులపాటు వనవాసానికి విహార యాత్రకు వెళ్తారని చరిత్ర చెబుతోంది. ఈ మేరకు రథోత్సవం అనంతరం దేవతావిగ్రహాలను కనకదుర్గ ఆలయానికి చేర్చుతారు. ఇక్కడే స్వామి వారి పరివారం పది రోజుల పాటు ఉంటుంది. అనంతరం దేవతామూర్తులను ఊరేగింపుగా తిరిగి ఆలయానికి తీసుకువచ్చి ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ పది రోజులపాటు ఆలయంలో అన్నిరకాల పూజలు నిలిపివేస్తారు.

శ్రీనగర్‌కాలనీ ట్రస్టుబోర్డు చైర్మన్ ఎన్నిక వివాదాస్పదం

- ఓటింగ్‌కు పిలిచి ముఖం చాటేసిన దేవాదాయ శాఖ అధికారులు
- సమాచారం ఇవ్వరా అంటూ ఆలయంలో సభ్యుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ట్రస్టు బోర్డు సభ్యులు

బంజారాహిల్స్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): శ్రీనగర్‌కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయం ట్రస్టు బోర్డు చైర్మన్ ఎన్నిక వివాదాస్పదమైంది. ఓటింగ్‌కు రావాలని పిలిచిన దేవాదాయ శాఖ అధికారులు తీరా సమయం వచ్చే సరికి ముఖం చాటేశారు. సమాచారం ఇవ్వకుండా అధికారులు ఎలా గైర్హాజర వుతారని ట్రస్టుబోర్డు సభ్యులు ఆలయంలో నిరసన వ్యక్తం చేశారు. అధికారుల తీరుపై దేవాదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. నగరంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఆలయంగా వేంకటేశ్వర ఆలయానికి పేరు ఉంది. పాత కమిటీ గడువు తీరడంతో కొత్త కమిటీ నియామకం నోటిఫికేషన్ వెలువడింది. ఆలయం చుట్టూ ఉండే ఎల్లారెడ్డిగూడ, ఇందిరానగర్, శ్రీనగర్‌కాలనీ, యూసుఫ్‌గూడ, మధురానగర్, వెంగళరావునగర్ ప్రాంతవాసులకు ప్రాధాన్యం ఇస్తూ కమిటీ నియామకం ఉంటుంది. అయితే, శ్రీనగర్‌కాలనీవాసులకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలంటూ వివాదం మొదలైంది. చివరకు అధికారులు, నాయకులు కలగజేసుకున్నారు. అన్ని ప్రాంతాల నుంచి 14 మంది ట్రస్టు బోర్డు సభ్యులను ఎంపిక చేశారు. ఇందులో నలుగురు శ్రీనగర్‌కాలనీకి చెందిన వారు ఉన్నారు. అయితే, ప్రమాణ స్వీకారం సమయంలో పది మంది మాత్రమే హాజరయ్యారు. శ్రీనగర్‌కాలనీకి చెందిన నలుగురు గైర్హాజరయ్యారు. ఆలయ సిబ్బంది నోటీసులతో వారం రోజుల తర్వాత ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో ఈనెల 27న చైర్మన్ ఎన్నిక ఉంటుందని దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సభ్యులందరికీ నోటీసులు ఇచ్చారు. పారదర్శకంగా ఓటింగ్‌లో పాల్గొనాలని చెప్పారు. ఈ మేరకు శుక్రవారం పది మంది ట్రస్టు బోర్డు సభ్యులు హాజరయ్యారు. కాలనీకి చెందిన నలుగురు మాత్రం గైర్హాజరయ్యారు.

ఇదిలా ఉండగా, నోటీసులు ఇచ్చిన అధికారులు ఎన్నిక సమయం దాటిపోయినా రాలేదు. ఫోన్ చేసినా ఎవరూ స్పందించలేదు. ఆలయ ఈవో తాను బెంగళూరులో ఉన్నట్టు చెప్పారు. సుమారు రెండు గంటలపాటు ఎదురు చూసిన సభ్యులు నిరసనకు దిగారు. ఈ వ్యవహారంపై కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

చైర్మన్ పదవి కోసమేనా?

ట్రస్టు బోర్డు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన కొన్ని రోజులకు కమిటీ మధ్య చీలికలు వచ్చాయి. శ్రీనగర్‌కాలనీకి చెందిన వ్యక్తికే చైర్మన్ పదవి అప్పగించాలని నలుగురు సభ్యులు పట్టుబడుతున్నారు. మిగతా పది మంది మాత్రం తమలో ఒకరికి అవకాశం ఇచ్చుకుంటామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో కాలనీకి చెందిన నలుగురు సభ్యులు దేవాదయ శాఖ మీద ఒత్తిడి తీసుకువచ్చి చైర్మన్ ఎన్నిక జరగకుండా చూశారని ఆరోపణలు వినిపించాయి. ఈ సందర్భంగా ట్రస్టు బోర్డు సభ్యులు అర్జున్‌యాదవ్, సుబ్బారెడ్డి, నర్సింగ్‌యాదవ్ తదితరులు దేవాదాయ శాఖ అధికారుల పనితీరును తప్పుబట్టారు. చైర్మన్ ఎన్నిక ఉందని అధికారులు నోటీసులు ఇవ్వడంతో పనులు మానుకొని తాము ఆలయానికి వచ్చినట్టు చెప్పారు. అధికారులు రాకపోగా, కనీసం సమాచారం ఇవ్వలేదని, ట్రస్టు బోర్డు సభ్యుల విషయంలో ఇంత నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం ఏమిటని మండిపడ్డారు. ఈ విషయంలో కమిషనర్‌తో పాటు దేవాదాయ శాఖ మంత్రి ని కూడా కలవనున్నట్టు ప్రకటించారు. సుమారు గంట పాటు ఆలయంలో నిరసన వ్యక్తం చేశారు.



నియామకపత్రాన్ని స్వీకరిస్తున్న జీఎన్ వెంకటరాయుడు

తెలంగాణ ఎఫ్‌సీఐ వర్కర్స్ ఫెడరేషన్ చైర్మన్‌గా జీఎన్ వెంకటరాయుడు

బంజారాహిల్స్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వర్కర్స్ ఫెడరేషన్ తెలంగాణ చైర్మన్‌గా జీఎన్ వెంకటరాయుడు నియమితులయ్యారు. ఫిలింనగర్‌లోని ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆల్ ఇండియా ఫుడ్ కార్పొరేషన్ వర్కర్స్ ఫెడరేషన్ చైర్మన్ అర్నాబ్ ఛటర్జీ, ఆల్ ఇండియా ఫుడ్ అండ్ డ్రింక్స్ వర్కర్స్ ఫెడరేషన్ చైర్మన్ డాక్టర్ బిశ్వప్రియరాయ్ చౌదరి జీఎన్ వెంకటరాయుడుకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీఎన్ వెంకటరాయుడు మాట్లాడుతూ కార్మికుల శ్రేయస్సు కోసం పనిచేస్తానని, వారికి అందాల్సిన పథకాలతో పాటు హక్కుల కోసం పోరాడుతానని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నాగార్జున, ప్రముఖ పారిశ్రామికవేత్త టి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి

బస్తీల్లో వసతుల కల్పనకు కృషి

బోరబండ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బస్తీల్లో వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి తెలిపారు. ఇందిరానగర్ ఫేజ్-1 బస్తీలో రూ.49.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని సంబంధిత కాంట్రాక్టర్ కు ఆయన సూచించారు. కాగా, సలీంబాబా దర్గా ప్రాంతానికి చెందిన సాబేరాబేగంకు రూ.55 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును కార్పొరేటర్ ఆమె ఇంటికి వెళ్లి అందజేశారు.

30లోగా రేషన్ తీసుకోవాలి

యూసుఫ్‌గూడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల ద్వారా అందించే నిత్యావసరాలను లబ్ధిదారులు ఈనెల 30లోగా తీసుకోవాలని ఖైరతాబాద్ సర్కిల్ అసిస్టెంట్ సివిల్ సప్లై ఆఫీసర్ బి.జ్యోతి సూచించారు. ప్రస్తుత పంపిణీ విధానం ప్రకారం రేషన్ డీలర్లు జూన్ లోనే మూడు నెలల సరుకులను ఇవ్వాలని ఆమె సూచించారు.

ఖబరస్తాన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి

బేగంపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలోని ఖబరస్తాన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. శుక్రవారం రెవెన్యూ అధికారులతో కలిసి ఖబరస్తాన్‌ను ఆమె సందర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సలీంఖాన్, హనీఫ్‌ఖాన్, బబ్లూ, మునీర్‌ఖాన్, లడ్డు, విశాల్ సుధాం, రమేష్, హనీటోచర్, జగదీష్ పాల్గొన్నారు.

8న వైఎస్సార్ అభిమానుల ఆత్మీయ సమ్మేళనం

బంజారాహిల్స్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా జూలై 8వ తేదీన వైఎస్సార్ అభిమానులతో మాదాపూర్‌లోని బుట్టా కన్వెన్షన్ సెంటర్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ ఇంటలెక్చువల్ విభాగం అధ్యక్షుడు వై.ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్యేకాలనీ రిక్రియేషన్ సెంటర్‌లో ఆయన వైఎస్సార్ అభిమానులతో కలిసి ఆత్మీయ సమ్మేళనం కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నేతలు ఏపీ రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఇంటలెక్చువల్ విభాగం ప్రధాన కార్యదర్శి చొక్కం సంజీవయ్య, పి.ఎస్.కృష్ణమోహన్‌రెడ్డి, డాక్టర్ బీఎంకే రెడ్డి, సురేష్‌రెడ్డి, బి.మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

రహ్మత్‌నగర్ రిజర్వాయర్‌కు మాగంటి పేరు పెట్టాలి

- ఎమ్మెల్యే తలసాని డిమాండ్



మాగంటి సంతాపసభలో మాట్లాడుతున్న తలసాని

యూసుఫ్‌గూడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ రిజర్వాయర్‌కు దివంగత జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పేరు పెట్టాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మహ్మద్ ఫంక్షన్‌హాల్‌లో మాగంటి గోపీనాథ్ సంతాప సభ కార్పొరేటర్ రాజ్‌కుమార్‌పటేల్ ఆధ్వర్యంలో జరిగింది. తలసాని మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చాక మాగంటి గోపీనాథ్ విగ్రహాలను ప్రతీ డివిజన్‌లో ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పేరుకే జూబ్లీహిల్స్ నియోజకవర్గం, ఉండేది మాత్రం పేదల బస్తీలు అని అన్నారు. మాగంటి గోపీనాథ్ సొంత ఖర్చులతో సేవా కార్యక్రమాలను నిర్వహించే వారన్నారు. అనంతరం మహిళలకు మాగంటి పేరుతో బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పి. విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రావుల శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్లు బండారి రాజ్‌కుమార్ పటేల్, దేదీప్యరావు, వెల్దండ వెంకటేష్, నాయకులు మాగంటి వజ్రనాథ్, యలమంచిలి రవి, నర్సింగ్‌దాస్, సురేందర్ యాదవ్, మాధవి, అమ్మాజీ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగిపోయారు : మన్నె



బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న గోవర్ధన్‌రెడ్డి

హైదరాబాద్/బంజారాహిల్స్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని అవకాశం రాగానే తగిన బుద్ధి చెబుతారని బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఖైరతాబాద్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వివిధ పార్టీలకు చెందిన యువకులు తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని నెరవేర్చలేక చతికిల పడిందన్నారు. బీఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో అన్నివర్గాల ప్రజలు ఆనందంగా జీవించారన్నారు. రాబోయే ఎన్నికల్లో కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఖైరతాబాద్‌లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని ఎక్కడి సమస్యలు అక్కడే ఉండిపోయాయని ఆరోపించారు. ప్రజాప్రతినిధుల నిర్లక్ష్య ధోరణిని ఎత్తి చూపించేందుకు త్వరలోనే నియోజకవర్గంలో పాదయాత్రలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారిలో బంజారాహిల్స్ డివిజన్‌కు చెందిన నవీన్, నితిన్, సిద్ధు, సాయి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు విప్లవ్, కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, నాయకులు గజ్జల ఆనంద్, కిరణ్‌యాదవ్, వెంకిముదిరాజ్, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దేశాల చూపు భారత్ వైపు



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దీపక్‌రెడ్డి

బంజారాహిల్స్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారత దేశాన్ని ప్రస్తుతం ప్రపంచంలోని అన్ని దేశాలు నిశితంగా గమనిస్తున్నాయని, ఎన్నో రంగాల్లో భారత్ ప్రపంచంలోనే అత్యుత్తమంగా నిలుస్తున్నదని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకాల దీపక్‌రెడ్డి అన్నారు. నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలనపై శ్రీకృష్ణానగర్‌లో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి తాతా రవి నేతృత్వంలో శుక్రవారం నిర్వహించిన రచ్చబండ కార్యక్రమానికి ఎంబీసీ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా దీపక్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచాన్ని కరోనా వంటి విపత్తు వణికిస్తే ప్రపంచంలోని ఎన్నో దేశాలకు వ్యాక్సిన్ అందజేసిన దేశం భారత్ అని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు కుంబాల గంగరాజు, దూల ప్రేమ్‌కుమార్, కొండపల్లి చంద్రమోహన్, డివిజన్ అధ్యక్షుడు కాత్రాజ్, పులి రాజు, బడుగు సతీష్ పాల్గొన్నారు.

నిషేధం విధించినా కొనసాగుతున్న గేమ్స్ బెట్టింగ్



మాట్లాడుతున్న అభయ్ రాజ్‌మిశ్రా

పంజాగుట్ట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఆన్‌లైన్ రియల్ మనీ గేమ్స్‌పై పూర్తిస్థాయి నిషేధం విధించడంతో ఆఫ్ షోర్ ఆన్‌లైన్ స్పోర్ట్స్ బెట్టింగ్, క్యాసినోలు విపరీతంగా లబ్ధిపొందుతున్నాయని, ఇది దేశీయ గేమింగ్ పరిశ్రమను చంపుతోందని తమ అధ్యయనంలో వెల్లడైందని పబ్లిక్ రెస్పాన్స్ ఎగైనెస్ట్ హెల్ప్‌నెస్ అండ్ యాక్షన్ ఫర్ రిడ్రెస్సల్(ప్రహార్) సంస్థ అధ్యక్షుడు అభయ్ రాజ్‌మిశ్రా అన్నారు. శుక్రవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్లిక్. బెట్. రిపీట్: కన్స్యూమర్ సర్వే ఆన్ ఫోర్సెస్ డ్రైవింగ్ ఆన్‌లైన్ బెట్టింగ్ అండ్ గ్యాంబ్లింగ్ ఇన్ తెలంగాణ పేరిట తాము ఇటీవల అధ్యయనం చేశామని, రియల్ మనీ గేమింగ్‌లో పాల్గొనే 2,671 మందితో మాట్లాడడం జరిగిందని తెలిపారు. వాటిని క్రోడీకరించి ఒక నివేదికను రూపొందించామన్నారు. తెలంగాణలో రియల్ మనీ గేమింగ్ చట్టవిరుద్ధమని 96 శాతం మంది వినియోగదారులకు తెలుసు, అయినప్పటికీ ఇప్పటికీ ఆన్‌లైన్ స్పోర్ట్స్ బెట్టింగ్, క్యాసినో బెట్టింగ్‌లో పాల్గొంటున్నారు. దాదాపు 87 శాతం మంది ప్రతి రోజూ ఆడుతున్నారని తెలిపారు. త్వరగా డబ్బు సంపాదించడం, వినోదం వంటి అంశాలు ఈ బెట్టింగ్‌కు ప్రధాన ప్రేరకాలుగా నిలుస్తున్నాయని అన్నారు. యువత, మహిళలు ఆటలు ఆడుతూ పెద్ద మొత్తంలో డబ్బులు పోగొట్టుకుంటున్నారని పేర్కొన్నారు. సమావేశంలో సంస్థ దక్షిణ భారత కన్వీనర్ మగేశ్వరన్, రాష్ట్ర ఇన్‌చార్జి డి.లక్ష్మణ్ యాదవ్, డి.భారతి పాల్గొన్నారు.

జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన



ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న నటి వాణ్యఅగర్వాల్

బంజారాహిల్స్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఏర్పాటైన జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన- 2025ను టాలీవుడ్ వర్ధమాన నటి వాణ్య అగర్వాల్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్‌లూమ్ వస్త్రోత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ఈ ఉత్పత్తులకు నేటికీ వన్నె తగ్గలేదని, నేటి తరం యువత కూడా హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారని అన్నారు. నిర్వాహకులు జయేష్‌గుప్తా మాట్లాడుతూ జూలై 2వ తేదీ వరకు కొనసాగనున్న ప్రదర్శనలో దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేతకారులు, చేతిపని బృందాలు తమ సిల్క్, హ్యాండ్‌లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల వస్త్రోత్పత్తులను అందుబాటులో ఉంచారని తెలిపారు.

ఎల్లమ్మ ఆలయం నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటు

అమీర్‌పేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ ఆలయం నూతన ధర్మకర్తల మండలి ఎట్టకేలకు ఏర్పాటైంది. 13 మందితో కూడిన కార్యవర్గాన్ని నియమిస్తూ శుక్రవారం దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ధర్మకర్తలుగా ఆకుల భూలక్ష్మి, మూల అమృత, గోదాస్ ఉమారాణి, మిర్యాల నవీన్ రాజ్, దండోత్కర్ మహేష్, వట్టికొండ హరిదేవరాయ చౌదరి, పి.సురేష్‌వర్మ, కొమ్ము రవీందర్, ఎం.శ్రీధర్ కుమార్‌గౌడ్, సి.సత్యనారాయణ, కొత్తపల్లి శంకర్ గౌడ్, బూర్గుల ఉమానాథ్‌గౌడ్, మొక్కపాటి భాస్కర్, ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా ఆలయ ముఖ్యఅర్చకులు అనిల్‌గౌడ్ నియమితులయ్యారు. వీరి పదవి కాలం సంవత్సరం ఉంటుంది.

టీజీఎస్పీడీసీఎల్ మెట్రో జోన్ సీఈగా సాయిబాబా

హైదరాబాద్ సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) మెట్రో జోన్ చీఫ్ ఇంజనీర్(సీఈ)గా సాయిబాబా శుక్రవారం ఖైరతాబాద్ మెట్రో జోన్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. టీజీఎస్పీడీసీఎల్ ప్రధానకార్యాలయంలో ఆర్ఏసీ సీఈగా పనిచేస్తున్న సాయిబాబాను మెట్రోజోన్ ఆపరేషన్ సీఈగా నియమిస్తూ దక్షిణ డిస్కం ఉత్తర్వులు జారీ చేసింది. మెట్రోజోన్ సీఈగా పనిచేస్తున్న చక్రపాణి దక్షిణ డిస్కం కమర్షియల్ డైరెక్టర్‌గా నియామకం కావడం మెట్రోజోన్ సీఈ పోస్టు ఖాళీ కావడంతో ఆ స్థానంలో సాయిబాబాను నియమించారు. మెట్రోజోన్ సీఈగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా పలువురు సీఈలు, ఎస్ఈలు, డీఈలు ఆయనకు అభినందనలు తెలిపారు.

మిసెస్ ఆసియా వరల్డ్-2025 విజేత రేవతి



డాక్టర్ రేవతి

హిమాయత్‌నగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): యూఎస్‌తోపాటు భారత్‌లో 16 ఏళ్లకు పైగా సామాజిక సేవ, మహిళా సాధికారత, ప్రపంచ మానవతా విలువల కోసం కృషి చేస్తున్నందుకుగాను 'మిసెస్ ఆసియా వరల్డ్ -2025' కిరీటాన్ని నగరానికి చెందిన డాక్టర్ రేవతి దక్కించుకున్నారు. ఈ విషయాన్ని మానస్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ సూర్యరేవతి మెట్టుకూరు గురువారం తెలిపారు. ఈనెల 22న దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ కార్యక్రమంలో ఈ అరుదైన గౌరవం దక్కిందన్నారు.

'ఊరి చివరి మనిషి' పుస్తకావిష్కరణ

బేగంపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత పోలీస్ ఇన్‌స్పెక్టర్ జుంటిపల్లి రాములు ఆత్మకథ 'ఊరి చివరి మనిషి' పుస్తకావిష్కరణ కార్యక్రమం బేగంపేటలో గురువారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఐపీఎస్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, సీనియర్ న్యాయవాది హెచ్.సుధాకర్‌రావు, విశ్రాంత డీఎస్పీ బి.రాములు, సినీనటుడు సుమన్ తదితరులు హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల వృత్తి వెనక ఉన్న మానవీయతను ప్రతిబింబించేదిగా రచన సాగిందని వారు పేర్కొన్నారు.

మిలటరీ భూముల స్వాధీనానికి ఎంవోయూ

అల్వాల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): హెచ్ఎండీఏ సుమారు 160 ఎకరాల రక్షణ భూమిని సేకరించేందుకు 330 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షణ మంత్రిత్వ శాఖ(ఎంవోడీ)కు బదిలీ చేస్తుంది. ఇందుకు సంబంధించి శనివారం సికింద్రాబాద్ తెలంగాణ, ఆంధ్రాసబ్ ఏరియా ప్రధాన కార్యాలయంలో హెచ్ఎండీఏ అధికారులు, డిఫెన్స్ అధికారులు ప్రత్యేకంగా భేటీ అవుతున్నారు. ఈ భూమి రెండు ఎలివేటెడ్ కారిడార్లు శామీర్‌పేట్-ప్యారడైజ్-డైయిరీ ఫామ్ రోడ్డు-మేడ్చల్ వరకు చేపట్టే ఎలివేటెడ్ కారిడార్‌కు కీలకమైంది. భూమి అప్పగింత పూర్తయిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాన్ని ప్రారంభిస్తుంది. రక్షణ మంత్రిత్వ శాఖ(ఎంవోడీ) ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత పనులు నిర్వహిస్తారు.

మద్యం మత్తులో పాఠశాల విద్యార్థుల ఆటోడ్రైవర్.. కేసు నమోదు

ఖైరతాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో పాఠశాల విద్యార్థులను తరలిస్తున్న ఆటోడ్రైవర్‌పై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఐమాక్స్ పక్కనున్న ప్యారడైజ్ హోటల్ వద్ద స్కూల్ పిల్లలను తరలిస్తున్న వాహనాల డ్రైవర్లను శుక్రవారం సాయంత్రం తనిఖీ చేస్తున్నారు. రాజిరెడ్డి అనే ఆటో డ్రైవర్ పూటుగా మద్యం తాగి 9 మంది పాఠశాల విద్యార్థులను తీసుకెళ్తున్నాడు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని సైఫాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి హెచ్చరించారు.

గుడ్ బై అంటూ వాట్సాప్ స్టేటస్.. అదృశ్యమైన యోగా టీచర్..!

- పోలీసులకు బంధువుల ఫిర్యాదు



సురేంద్ర

పంజాగుట్ట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అందరికి గుడ్ బై అని వాట్సాప్ స్టేటస్ పెట్టిన బెంగళూరుకు చెందిన యోగా టీచర్ అదృశ్యమయ్యాడు. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హరియాణాకు చెందిన సురేంద్ర(30) బెంగళూరులో ఉంటూ యోగా ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. అతడికి మరో యోగా టీచర్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమకు దారితీసింది. ఆమెను కలిసేందుకు ఈనెల 22వ తేదీన హైదరాబాద్‌కు వచ్చాడు. జూబ్లీహిల్స్‌తో పాటు మరో ప్రాంతంలోని హోటల్‌లో ఉన్నాడు. శుక్రవారం పంజాగుట్టలోని నెక్స్ గలేరాయి మాల్ వద్దకు ఇద్దరూ వచ్చారు. ఇద్దరి మధ్య ఏమైందో ఏమో.. కొద్దిసేపటి అనంతరం తనకు మనసు బాగాలేదని.. ఆమెకు చెప్పకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం అందరికీ గుడ్‌బై అని వాట్సాప్ స్టేటస్ పెట్టి మొబైల్ స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో కంగారుపడ్డ బంధువులు, స్నేహితులు పలు ప్రాంతాల్లో వెతికారు. ఫలితం లేకపోవడంతో పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల ఫుటేజీ, సెల్‌ఫోన్ కాల్స్ డేటాను పోలీసులు పరిశీలిస్తున్నారు. సురేంద్ర కుటుంబసభ్యులు అతడికి వివాహం చేసేందుకు సంబంధాలు చూస్తున్నారు. ప్రేమించిన యువతిని నగరంలో కలుసుకున్న అనంతరం ఆయన అదృశ్యం కావడం అనుమానాలకు తావిస్తోంది. యువతి, అతడి కుటుంబ సభ్యులను విచారిస్తే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు చెబుతున్నారు. వివరాలు తెలిసిన వారు 87125 71535, 78126 61275కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్ఐ వెంకటకిషన్ కోరారు.

బోనాలకు విచ్చేయండి!

- మంత్రులకు ఉజ్జయినీ మహంకాళి ఆలయ అధికారుల ఆహ్వానం
- జాతరకు ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

సికింద్రాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతరకు హాజరు కావాలంటూ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌లకు ఆహ్వానం అందింది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం అందించిన ఆలయ అధికారులు శుక్రవారం మంత్రులను వారి నివాసాల్లో కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. జాతరను సాఫీగా, అత్యంత వైభవంగా నిర్వహించడానికి తీసుకుంటున్న చర్యలు, ఆలయాన్ని ముస్తాబు చేస్తున్న తీరుతెన్నుల గురించి ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి, ఆలయ ఫ్యామిలీ ట్రస్టీ సురిటి కామేశ్వర్‌లు మంత్రులకు వివరించారు.



మహంకాళి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌లకు, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ అధికారులు

సంప్రదాయాలకు విరుద్ధంగా వ్యవహరించవద్దు: తలసాని

సంప్రదాయాలకు విరుద్ధంగా వ్యవహరించి భక్తుల ఆగ్రహానికి గురి కావద్దని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆలయ అధికారులకు సూచించారు. ఉజ్జయినీ మహంకాళి ఆలయ అధికారులతో ఎమ్మెల్యే శుక్రవారం మాట్లాడారు. బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం, బోనాల ఉత్సవాల వంటి పవిత్ర కార్యక్రమాల నేపథ్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా కొత్త విధానాలకు తెర తీయవద్దని స్పష్టం చేశారు. వివిధ రకాల పేర్లతో భక్తుల నుంచి డబ్బు వసూలు చేసే విధానాలను మానుకోవాలని సూచించారు. పండుగలు ప్రశాంత వాతావరణంలో, సంతోషంగా జరిగేలా చూడాలని కోరారు.

జాతరకు శరవేగంగా ఏర్పాట్లు..

ఉజ్జయినీ మహంకాళి ఆలయం బోనాల జాతరకు ఆలయ అధికారులు, నిర్వాహకులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. జూలై 13, 14 తేదీల్లో జరిగే బోనాల ఉత్సవాలకు ఆలయాన్ని నిర్వాహకులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే ఆలయానికి రంగులు వేశారు. ఆలయ పరిసరాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దే పనుల్లో వారు నిమగ్నమయ్యారు. విద్యుత్ కాంతుల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఆషాఢ మాసం మొదటి శుక్రవారం కావడంతో ఉజ్జయినీ మహంకాళి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సికింద్రాబాద్‌తో పాటు పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ అధికారులు అన్ని సౌకర్యాలు కల్పించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే నాణ్యమైన విద్య

- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్

తిరుమలగిరి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. బొల్లారంలో గ్లాండ్ ఫార్మా కంపెనీ సీఎస్ఆర్ నిధులతో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి కళాశాల భవనాన్ని నిర్మించిన గ్లాండ్ ఫార్మా కంపెనీ వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులందరూ ప్రభుత్వ బడులు, కళాశాలల్లోనే చేరాలని ఎమ్మెల్యే కోరారు. కళాశాల అభివృద్ధి కోసం నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ.25లక్షలు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు. గ్లాండ్ ఫార్మా మేనేజింగ్ ట్రస్టీ రఘురామన్, డీఐఈఓ కిషన్, ఇంటర్మీడియట్ బోర్డు ఎడ్యుకేషన్ డిప్యూటీ సెక్రటరీ యాదగిరి, ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, కంటోన్మెంట్ మాజీ వైస్ ప్రెసిడెంట్ జయప్రకాశ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

అడ్డగుట్ట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బడీడు పిల్లలందరిని బడిలో చేర్పించేలా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక జాతీయ కన్వీనర్ వెంకట్‌రెడ్డి అన్నారు. బాలలహక్కుల పరిరక్షణ వేదిక, మారేడుపల్లి మండల తల్లుల సంఘం ఆధ్వర్యంలో అడ్డగుట్ట ఆజాద్‌చంద్రశేఖర్‌నగర్ బస్తీలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ, మారేడుపల్లి మండలంలో 289 మంది బాలకార్మికులు ఉన్నారని, వారందరిని బడికి పంపించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కోరారు. పిల్లలకు నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భాగ్యలక్ష్మి, జిల్లా కో కన్వీనర్ శోభ, కో ఆర్డినేటర్ స్వామి, సీఆర్‌పీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, ప్రవీణ్, విజయ శశికళ, ప్రేమ, ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధులు సువర్ణ, లావణ్య, సౌజన్య పాల్గొన్నారు.

ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి: శివరామకృష్ణ

బౌద్ధనగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, దురలవాట్లకు దూరంగా ఉండాలని భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ సూచించారు. పార్శీగుట్ట న్యూఅశోక్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. స్వాంతన చారిటబుల్ ట్రస్ట్, గద్దె రామోజీ ఫౌండేషన్, కిమ్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో కిమ్స్ ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు. సుమారు రెండు వందల మందికి వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ శిబిరంలో న్యూఅశోక్‌నగర్ కమిటీ అధ్యక్షుడు పిట్ల ఓంప్రకాశ్‌ముదిరాజ్, సభ్యులు గిరి, శ్రీనివాస్, రూప్ సాయి, క్యాంప్ కో ఆర్డినేటర్ నర్సింగరావు, విక్రమ్, లావణ్య పాల్గొన్నారు.



వీధి వ్యాపారులతో కలిసి నినాదాలు చేస్తున్న కార్పొరేటర్ సునీత

వీధి వ్యాపారులను ఆదుకోవాలి: సునీత

చిలకలగూడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని కార్పొరేటర్ సునీత డిమాండ్ చేశారు. మెట్టుగూడ - తార్నాక రోడ్డులో వీధి వ్యాపారుల బండ్లను శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ వ్యాపారులతో కలిసి అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, మెట్టుగూడ-తార్నాక రోడ్డులో సుమారు వంద మంది వీధి వ్యాపారాలు చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో చిరు, వీధి వ్యాపారులకు ఇబ్బంది కలగకుండా దుకాణాలు ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దుకాణాలను కూల్చివేసి వారిని ఇబ్బంది పెట్టడం బాధాకరమన్నారు. వెంటనే జోనల్ కమిషనర్, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వీధి వ్యాపారులను ఆదుకోవాలని కార్పొరేటర్ డిమాండ్ చేశారు.

అన్నపూర్ణ క్యాంటీన్ పేరు మార్చడాన్ని ఖండిస్తున్నా

- కార్పొరేటర్ సామల హేమ

బౌద్ధనగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో ఏర్పాటు చేసిన అన్నపూర్ణ క్యాంటీన్ పేరును కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరా క్యాంటీన్‌గా మార్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడారు. పేద ప్రజల ఆకలిని తీర్చాలనే సంకల్పంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నగరంలో నాణ్యతతో కూడిన ఐదు రూపాయల భోజనం పథకాన్ని ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాల పేర్లు మారుస్తూ ప్రభుత్వాన్ని నడిపితే రానున్న రోజుల్లో ప్రజలు ప్రభుత్వాన్ని కూడా మారుస్తారని విమర్శించారు.



మాట్లాడుతున్న హేమ



మీడియా సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న క్రైస్తవ సంఘాల ప్రతినిధులు

క్రిస్టియన్ మీడియా సెంటర్ ప్రారంభం

రెజిమెంటల్‌బజార్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవ సంక్షేమం, అభివృద్ధి కోసం క్రిస్టియన్ మీడియా సెంటర్‌ను ప్రారంభించినట్టు నిర్వాహకులు భాస్కర్, తేజోమయ, ముత్తయ్యలు తెలిపారు. సికింద్రాబాద్ ఎస్డీ రోడ్డులో ఉన్న రిజుమాల్ మెన్షన్‌లో క్రిస్టియన్ సంఘాల సహకారంతో క్రిస్టియన్ ప్రెస్ క్లబ్‌ను శుక్రవారం వారు ప్రారంభించారు. క్రిస్టియన్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయడానికి మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

మహిళ అదృశ్యం

బౌద్ధనగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పుట్టింటికి బయలుదేరి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ జ్ఞానేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖనికి చెందిన మంద మౌనిక(24) నాలుగు సంవత్సరాల క్రితం శంగి లెనిన్‌తో వివాహమైంది. అతను క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్యభర్తలిద్దరూ సీతాఫల్‌మండిలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివసిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో భర్తతో గొడవ జరిగిందని మౌనిక తన తండ్రికి ఈ నెల 11న ఫోన్ చేసింది. తాను ఇంటికి వస్తానని తెలిపింది. ఇంటికి బయలుదేరిన మౌనిక ఇప్పటి వరకు కనిపించడం లేదు. ఆమె కోసం పలు చోట్ల గాలించిన ఫలితం లేదు. దీంతో తండ్రి తన కుమార్తె కనిపించడం లేదని గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.



అదృశ్యమైన మౌనిక

సమస్యల పరిష్కారమే లక్ష్యం: శ్రీనివాస్‌యాదవ్

రాంగోపాల్‌పేట్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో రూ.1.36కోట్ల విలువైన అభివృద్ధి పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలనీలు, బస్తీలలో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలను చాలా వరకు పరిష్కరించామన్నారు. బీఆర్ఎస్ హయాంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసుకున్నామని, కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని ఆపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీల్లో చేపట్టాల్సిన రోడ్లు, సీవరేజ్, తదితర అభివృద్ధి పనులకు ప్రతిపాదనలను రూపొందించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కళాసీగూడలో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సుచిత్ర, జీహెచ్ఎంసీ బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాకు నాయక్, ఈఈ సుబ్రహ్మణ్యం, వాటర్ వర్క్స్ డీజీఎం ఆశీష్, ఎంటమాలజిస్ట్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మల్లికార్జున్‌గౌడ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్

కనుల పండువగా జగన్నాథ రథయాత్ర

రెజిమెంటల్‌బజార్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఇస్కాన్ ఆలయ ఆధ్వర్యంలో జగన్నాత రథ యాత్రను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రథ యాత్రను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభించారు. ఇస్కాన్ ఆలయం నుంచి ప్రారంభమైన రథయాత్ర వైఎంసీఏ, ప్యాట్నీ సెంటర్, క్లాక్‌టవర్ మీదుగా తిరిగి ఇస్కాన్ ఆలయానికి చేరుకుంది. రథయాత్రలో ఆలయ నిర్వాహకులు హరికృష్ణ దాస్, సురేశ్, రాధికాపతిప్రభు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



ఇస్కాన్ ఆలయం ఆధ్వర్యంలో రథయాత్ర

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ జనరల్ బజార్‌లోని జగన్నాథ స్వామి ఆలయంలో శుక్రవారం రథయాత్ర కనుల పండువగా కొనసాగింది. జగన్నాథ స్వామి రాంగోపాల్ ట్రస్టు సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులను స్వామి వారి దర్శనానికి అనుమతించారు. సాయంత్రం నాలుగు గంటలకు స్వామి వారి రథాన్ని పలు వీధుల్లో ఊరేగించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జగన్నాథ స్వామి రాంగోపాల్ ట్రస్ట్ వ్యవస్థాపక సభ్యులు పురుషోత్తం మలాని అన్ని ఏర్పాట్లు చేశారు.



డైరీని ఆవిష్కరిస్తున్న అర్చక ఉద్యోగ జేఏసీ ప్రతినిధులు

ఉగాది టూ ఉగాది డైరీ ఆవిష్కరణ

మారేడుపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వెస్ట్ మారేడుపల్లిలో గల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఉగాది టూ ఉగాది డైరీని అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేందర్‌శర్మ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో అర్చక ఉద్యోగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేశ్వరశర్మ, ఆలయ అర్చకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిరండి: సంతోష్

సికింద్రాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళనానికి ప్రజలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదం సంతోష్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తన జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి యేటా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. శనివారం రాత్రి 7 గంటలకు ప్రారంభమయ్యే ఆత్మీయ సమ్మేళనంలో మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యే, ఇతర పార్టీల నాయకులు భాగస్వాములవుతారని ఆదం సంతోష్ తెలిపారు.



సంతోష్

నేడు అవగాహన ఒప్పంద భేటీ

అల్వాల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ తెలంగాణ, ఆంధ్రాసబ్‌ఏరియా ప్రధాన కార్యాలయంలో హెచ్‌ఎండీఏ అధికారులు, డిఫెన్స్ అధికారులు శనివారం ప్రత్యేకంగా భేటీ అవుతున్నారు. రెండు ఎలివేటెడ్ కారిడార్లు... శామీర్‌పేట్- ప్యారడైజ్- డైరీఫామ్ రోడ్డు- మేడ్చల్ వరకు చేపట్టే ఎలివేటెడ్ కారిడార్‌కు కీలకమైంది. 160 ఎకరాల(డిఫెన్స్) రక్షణ భూమిని సేకరించేందుకు 330 ఎకరాల ప్రభుత్వ భూమి బదిలీ కానుంది. రక్షణ మంత్రిత్వశాఖ(ఎంవోడీ) ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న తరువాత పనులు నిర్వహిస్తారు. ఈ భూమి అప్పగింత పూర్తయిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాన్ని ప్రారంభించనుంది.

గొర్రెల, మేకల పెంపకందార్లను ఆదుకోవాలి

- సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి

తార్నాక, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గొర్రెల, మేకల పెంపకం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సోమనబోయిన సింహాద్రి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా గొర్రెల, మేకల పెంపకంపై సుమారు 12లక్షల కుటుంబాలు ఆధారపడ్డాయని, వారిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఇటీవల గొర్రెలు బ్రూసెల్లోసిస్ వ్యాధి బారిన పడి మరణిస్తున్నాయని, ప్రభుత్వం స్పందించి వెంటనే మెరుగైన వైద్యం అందించాలని ఆయన కోరారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

అడ్డగుట్ట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని తుకారాంగేట్ సీఐ శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. తుకారాంగేట్‌లోని ప్రైవేట్ స్కూల్‌లో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, ఎట్టి పరిస్థితుల్లోనూ గంజాయి, డ్రగ్స్ జోలికి వెళ్లకూడదని విద్యార్థులకు సూచించారు. ఎవరైనా మాదక ద్రవ్యాలు అమ్ముతున్నట్టు తెలిస్తే 190కు ఫోన్ చేయాలన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వడ్డెర ఓబన్న చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా స్వామి



గోగుల స్వామి

అడ్డగుట్ట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వడ్డెర ఓబన్న చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా అడ్డగుట్ట వడ్డెరబస్తీకి చెందిన గోగుల స్వామి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో వడ్డెరలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. వడ్డెర సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. తనను నియమించిన బీసీ కులాల సమితి అధ్యక్షుడు దుర్గారావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మిసెస్ ఆసియా వరల్డ్-2025 విజేత రేవతి

హిమాయత్‌నగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): యుఎస్‌తో పాటు భారత్‌లో 16 ఏళ్లకు పైగా సామాజిక సేవ, మహిళా సాధికారత, ప్రపంచ మానవతా విలువల కోసం కృషి చేస్తున్నందుకు గాను 'మిసెస్ ఆసియా వరల్డ్ విన్నర్-2025' కిరీటాన్ని నగరానికి చెందిన డా. రేవతి దక్కించుకున్నారు. మానస్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డా.సూర్యరేవతి శుక్రవారం తెలిపారు.

నిషేధం విధించినా కొనసాగుతున్న గేమ్స్ బెట్టింగ్

పంజాగుట్ట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఆన్‌లైన్ రియల్ మనీ గేమ్స్‌పై పూర్తిస్థాయి నిషేధం విధించడంతో ఆఫ్ షోర్ ఆన్‌లైన్ స్పోర్ట్స్ బెట్టింగ్, క్యాసినోలు విపరీతంగా లబ్ధిపొందుతున్నాయని, ఇది దేశీయ గేమింగ్ పరిశ్రమను చంపుతోందని తమ అధ్యయనంలో వెల్లడైందని పబ్లిక్ రెస్పాన్స్ ఎగైనెస్ట్ హెల్ప్‌నెస్ అండ్ యాక్షన్ ఫర్ రిడ్రెస్సల్(ప్రహార్) సంస్థఅధ్యక్షుడు అభయ్ రాజ్‌మిశ్రా అన్నారు. శుక్రవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్లిక్.బెట్.రిపీట్: కన్స్యూమర్ సర్వే ఆన్ ఫోర్సెస్ డ్రైవింగ్ ఆన్‌లైన్ బెట్టింగ్ అండ్ గ్యాంబ్లింగ్ ఇన్ తెలంగాణ పేరిట తాము ఇటీవల అధ్యయనం చేశామని, రియల్ మనీ గేమింగ్‌లో పాల్గొనే 2,671 మందితో మాట్లాడామని చెప్పారు. వాటిని క్రోడీకరించి ఒక నివేదికను రూపొందించామని వారు అన్నారు. రాష్ట్రంలో రియల్ మనీ గేమింగ్ చట్ట విరుద్ధమని 96 శాతం మంది వినియోగదారులకు తెలుసని, అయినప్పటికీ ఆన్‌లైన్ స్పోర్ట్స్ బెట్టింగ్, క్యాసినో బెట్టింగ్‌లో పాల్గొంటున్నారని అన్నారు. దాదాపు 87 శాతం మంది ప్రతి రోజూ బెట్టింగ్‌లో పాల్గొంటున్నారని తెలిపారు. త్వరగా డబ్బు సంపాదించడం, వినోదం వంటి అంశాలు ఈ బెట్టింగ్‌కు ప్రధాన ప్రేరకాలుగా నిలుస్తున్నాయన్నారు. యువత, మహిళలు ఆటలు ఆడుతూ పెద్ద మొత్తంలో డబ్బులు పోగొట్టుకుంటున్నారని పేర్కొన్నారు. సమావేశంలో సంస్థ దక్షిణ భారత కన్వీనర్ మగేశ్వరన్, రాష్ట్ర ఇన్‌చార్జి లక్ష్మణ్ యాదవ్, భారతి పాల్గొన్నారు.